కంకర వేశారు.. బీటీ మరిచారు

- అదుపు తప్పుతున్న వాహనాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

చెదురుపల్లి గ్రామ సమీపంలో కంకర వేసి ఉన్న దృశ్యం

వెల్దండ, మే 22: మండలం నుంచి చారగొడకు వెళ్లే రహదారిపై కంకర పరిచి బీటీ వేయక పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెల్దండ మండలం చెదురుపల్లి గ్రామ సమీపంలో కల్వర్టు వద్ద, బైరాపూర్ చెదురుపల్లి గ్రామాల మధ్య బొల్లిగుట్ట తండా వద్ద గతేడాది కల్వర్టు నిర్మాణాలు చేపట్టి ఒక్కోచోట 500 మీటర్ల మేర రహదారిపై కంకర పరిచారు. ఏడాది దాటినా దానిపై బీటీ వేయకపోవడంతో రోడ్డు అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారిపై బైరాపూర్, బొల్లంపల్లి, నగరగడ్డతండా, బొల్లిగుట్ట తండా, చెదురుపల్లి, పోచమ్మగడ్డ తండా, దుబ్బ తండా, రావిచెట్టుబావి తండా, బొల్లిగుట్ట తండా, మల్లయ్యగుండు తండా తదితర గ్రామాల ప్రజలు నిత్యం వెల్దండ, కల్వకుర్తికి రాకపోకలు సాగిస్తుంటారు. రూ.లక్షలు వెచ్చించి కల్వర్టుల నిర్మాణాలు చేపట్టిన అధికారులు కంకరపై బీటీ వేయక పోవడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ నిర్మాణం చేపట్టి ప్రమాదాలను నివారించాలని ఆయాగ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఏడాదిగా పట్టించుకోవడం లేదు..

రోడ్డు తవ్వి ఏడాది కావాస్తుంది. ఇప్పటివరకు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఒక్కొక్కచోట అర కిలో మీటర్ మేర పెద్ద సైజు కంకర రాళ్లు వేశారు. రోడ్డు వెడల్పున పర్చడంతో ద్వి చక్రవాహనాలు వెళ్లాడానికి ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. అధికారులు చొరవ తీసుకొని వెంటనే రోడ్డును బాగు చేయాలి. లేదంటే ఆందోళన చేస్తాం.

- పోలె అశోక్, చెదురుపల్లి

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం..

పెండింగ్ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు 4సార్లు నోటీసులు ఇచ్చాం. అయినా అతను స్పందించడం లేదు. తనకు ఇతర పనులకు సంబంధించిన పాత బకాయి డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని అవి వచ్చిన వెంటనే పనులు చేస్తామని తప్పించుకుంటున్నాడు. ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. తొందరలో పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

- లక్ష్మీపతి, ఏఈ ఆర్‌అండ్‌బీ

వరిధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

కల్వకుర్తి, మే 22 : కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ సీతారామారావు సందర్శించారు. రైతులు తీసుకొచ్చిన వరిధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. వరి ధాన్యాన్ని ఆర బెట్టుకుని విక్రయానికి తీసుకురావాలని రైతులకు సూచించారు. వరిధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగనీయొద్దని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఏ రోజు ధాన్యం ఆరోజే లోడ్ చేసి పంపించాలని పీఏసీసీఎస్ కార్యదర్శిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట తాసీల్దార్ ఇబ్రహీం, పీఏసీసీఎస్ సీఈవో వెంకట్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి

- ఎంపీ రాములు, ఎమ్మెల్యే వంశీకృష్ణ

మాట్లాడుతున్న ఎంపీ రాములు

ఉప్పునుంతల, మే 22: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల్లో అభివృద్ధి చెందుతాయని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు రాములు, ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. బుధవారం ఎంపీపీ అరుణానర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందేలా అధికారులు,ప్రజాప్రతినిధులు కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా శాఖలవారిగా సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యంగా ఎండా కాలం దృష్ట్యా మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు వారం రోజుల్లో కూలీ డబ్బులు చెల్లించాలన్నారు. ముఖ్యంగా వైద్యం, విద్యపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులివ్వాలని ఆదేశించారు. ఐకేపీ ద్వారా ప్రతి మండలానికి ఒక పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే స్వయంగా వైద్యుడు కావడం వల్ల పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీ సూచించారు. మండలంలోని దుందుభీ వాగు నుంచి ఇసుక ఆక్రమ రవాణాను అరికట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీ రాములును మండల ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్‌రావు, తాసీల్దార్ శ్రీకాంత్, జెడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమలత, వైద్యాధికారులు బిక్యునాయక్, నరేందర్, ఏపీఎం సైదులు, ఏపీవో సుదర్శన్‌గౌడ్, నాయకులు అనంతారెడ్డి, నర్సింహారెడ్డి , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్తీ విత్తన విక్రయాలపై నిఘా

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్‌టౌన్, మే 22 : జిల్లాలో కల్తీ విత్తన విక్రయాలపై నిఘా ఏర్పాటు చేసేందుకు గానూ పది మందితో టీం ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. టీం సభ్యులు అగ్రికల్చర్ ఆఫీసర్లతో కలిసి జిల్లాలో ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లో విత్తనాలను టెస్ట్ చేసి క్వాలిటీ విత్తనాలకు రైతులకు అందేలా చేయాలని సూచించారు. రైతులకు కల్తీ విత్తనాలు విక్రయిస్తే చట్టరిత్యా చర్య తీసుకుంటామని తెలిపారు. సీసీఎస్ సీఐ శంకర్ ఆధ్వర్యంలో పని చేసే టీంలో వంగూరు ఎస్సై మహేందర్, తాడూరు ఎస్సై మహేశ్, లింగాల ఎస్సై జగన్‌మోహన్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఉంటారని ఎస్పీ తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చారకొండ, మే 22 : మండలంలో ఎవరైన శాంతి విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చని, సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకులకు తీవ్ర గాయాలు

కల్వకుర్తి, మే 22 : కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామ గేట్ సమీపంలో కోడాద-జడ్చర్ల ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లితోపాటు ఇద్దరు కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఆరుగురికి స్వల్పంగా గాయలయ్యాయి. స్థానికుల కథనం మేరకు చారకొండ మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన శ్యామలమ్మ తన ఇద్దరు కుమారులు రమేశ్, అంజితో కలిసి తమ సొంత గ్రామానికి బోలెరో వాహనంలో వస్తున్నారు. తాండ్ర గేట్ సమీపం వద్దకు చేరుకోగానే వీరు ప్రయాణిస్తున్న బోలెరో వాహానాన్ని ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీ కొట్టింది. ప్రమాదంలో శ్యామలమ్మతోపాటు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషయంగా ఉండడంతో హైదరాబాద్ తరలించారు.

ఇది ఇలా ఉంటే ప్రమాద సమయంలో డీసీఎం రోడ్డుకు అడ్డంగా తిరిగింది, ఈ సమయంలో డీసీఎం వెనుకాల వస్తున్న మారో ఆటో డీసీఎంను తప్పించబోయి రోడ్డు కింద ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఆటోలో ఉన్న ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. వీరంతా దేవరకొండకు చెందిన వారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరు మద్దిమడుగుకు వెళ్లి దేవుని దర్శనం అనంతరం తిరిగి హైదరాబాద్ వెళ్తున్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

బిజినేపల్లి, మే 22 : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో నీతి బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలానికి 50 బస్తాల జీలుగ విత్తనాలు వచ్చాయని, 30 కిలోల బస్తా ధర రూ.1,116 ఉంటుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో తమ గ్రామాల్లోని ఏఈవోలను సంప్రదించాలని పేర్కొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కొల్లాపూర్ రూరల్, మే 22: కోడేరు మండలం నర్సాయిపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ కొల్లాపూర్ అధ్యక్షుడు కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కాలనీలోని ట్యాంకుకు తాగునీరు రావడంలేదన్నారు. కాలనీవాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారన్నారు. వెంటనే పరిష్కరించాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కల్వకుర్తి రూరల్, మే 22 : గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కల్వకుర్తి ఎంపీడీవో వెంకట్రాములు గ్రామ కార్యదర్శులకు సూచించారు. బుధవారం కల్వకుర్తి మండలం తర్నికల్ తండాను ఎంపీడీవో వెంకట్రాములు సందర్శించారు. గ్రామంలో పర్యటించిన అనంతరం గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అదేవిధంగా తర్నికల్, జీడిపల్లి, ఎల్లికట్ట గ్రామాలతోపాటు ఆయా గ్రామాలను ఎంపీవో దేవేందర్ సందర్శించి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. గ్రామంలో తడి, పొడిచెత్తను వేరు చేసి వాటి ద్వారా ఆదాయాన్ని సమకూర్చాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

రోగులకు పండ్ల పంపిణీ

నాగర్‌కర్నూల్‌టౌన్, మే 22 : మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం నాయకులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, కుర్మయ్య, రాజవర్ధన్, లక్ష్మణ్, ఎంపీటీసీ కరుణాకర్, సత్యం ఉన్నారు.

రుణమాఫీ కూడా బోనస్ లాంటిదే

- తలా ఒక మాట మాట్లాడుతున్న మంత్రులు
- కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

కల్వకుర్తి, మే 22 : సన్న వడ్లకు వచ్చే వానకాలం నుంచి రూ.500 బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటకు మంగళం పలికిందని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మండిపడ్డారు. ఎన్నికలకు ముందు రైతులు పండించిన వడ్లకు మద్దతు ధరకు రూ.500 కలిపి ఇస్తామని రైతుల ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికలయ్యాక సన్న వడ్లకే బోనస్ ఇస్తామని మాట మార్చి బొంకులు బొంకుతున్నారని దుయ్యబట్టారు. బోనస్‌పై మంత్రులు తమకు ఇష్ట వచ్చిన రీతిలో వక్రభాష్యం చెబుతూ రైతులను గందరగోళంలో ముంచుతున్నారని విమర్శించారు. రుణమాఫీపై కూడా ఇలాగే వక్రబాష్యం చెప్పి రైతుల చెవుల్లో పువ్వులు పెట్టడం ఖాయమని మున్సిపల్ చైర్మన్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆరు గ్యారెంటీలు అమలు చేశామని గప్పాలు కొట్టుకోవడం మినహా నిజంగా అమలు చేసింది శూన్యమని సత్యం మండిపడ్డారు. ప్రభుత్వం వచ్చి ఆరునెలల్లోపే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని, కాకపోతే అధికారం ఉందని కాంగ్రెస్ నాయకులు గొప్పలు ప్రదర్శిస్తున్నారని ఆయన ఎద్దేవ చేశారు. పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేలా ఫలితాలు ఉండబోతున్నాయని ఆయన చెప్పారు. గ్రామాల్లో ప్రజలు కేసీఆర్‌ను తలుచుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీకి నమ్మి ఓట్లు వేస్తే నట్టేట ముంచిందని బాధ పడుతున్నారని మున్సిపల్ చైర్మన్ పేర్కొన్నారు. ప్రజలతో కలిసి ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చేలా ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలి

డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య

అచ్చంపేటరూరల్, మే 22: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని మండల వ్యవసాయ శాఖాధికారి కృష్ణయ్య డీలర్లకు సూచించారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన ఇన్‌పూట్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొన్న ప్రతి రైతుకు ఖచ్చితంగా రసీదులివ్వాలన్నారు. దుకాణంలో ఉన్న స్టాక్‌తో పాటు వాటి ధరలను సైన్ బోర్డుపై డిస్‌ప్లే చేయాలన్నారు. వారం రోజులకోసారి స్టాక్ వివరాలు వ్యవసాయ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. సీడ్ వివరాలు ప్రతినెల 5వ తేదీన పోర్టర్ నుంచి ఫాం డీలో నమోదు చేయాలన్నారు. కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను ఉంచరాదన్నారు. డీలర్లు లైసెన్స్‌ను రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో పట్టణంతో పాటు మండలంలోని డీలర్లు పాల్గొన్నారు.

లక్ష్మీనారసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

తిమ్మాజిపేట : పూర్ణాహుతిని నిర్వహిస్తున్న అర్చకులు

తిమ్మాజిపేట/వెల్దండ, మే 22 : మండలంలోని అప్పాజిపల్లి గ్రామంలోని లక్ష్మీనారసింహ స్వామి ఆలయంలో బుధవారం వార్షికోత్సవ పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు కృష్ణమూర్తి, గంగాధర శర్మల ఆధ్వర్యంలో మహాచండియాగం, స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శైలజా వెంకట్రామారెడ్డి దంపతులు ఆలయానికి రూ.10,116 విరాళం అందజేశారు. అదేవిధంగా వెల్దండ మండలంలోని బైరాపురంలోని లక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాలు భాగంగా బుధవారం స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పశుపోషణపై రైతులకు అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి శివరాజ్

తిమ్మాజిపేట, మే 22 : మండలంలోని ఆర్ సీతతండాలో బుధవారం నాబార్డ్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు పశుపోషణ, పాడిపరిశ్రమపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి శివరాజ్ మాట్లాడుతూ వర్షాకాలంలో పశుపోషణపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ, బీక్యూటీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పాడి పశువుల కోసం మేలు రకాలైన గడ్డిని పెంచుకోవాలని, మంచి దాణను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో విజయ డైరీని ఏర్పాటు చేయాలని రైతులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ ప్రతినిధులు శ్రీనివాస్,జగన్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అర్థిక సాయం అందజేత

ఊర్కొండ/కల్వకుర్తిరూరల్, మే 22 : మండలంలోని జకినాల పల్లికి చెందిన పీ. రాంచంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. విష యం తెలుసుకున్న బీఆర్ఎస్ యూత్‌వింగ్ మండలాధ్యక్షుడు శేఖర్ యాదవ్ మృతుడి కు టుంబాన్ని పరామర్శించి రూ.5వేలు అందజేశారు. అదేవిధంగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్యాప నికిల్‌రెడ్డి తన అనుచరులతో బాధిత కుటుంబానికి రూ.5వే లు పంపించాడు.

కల్వకుర్తి మండలం జిల్లెల్లలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దివ్యాంగుడు కృష్ణ కుటుంబ సభ్యులకు ఉప్పల వెంకటేశ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో బుధవారం రూ.3వేలు, జిల్లా హ్యూమన్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.వెయ్యి ఆర్థిక సాయం అందించారు.

25న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నాగర్‌కర్నూల్‌టౌన్, మే 22 : జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 25వ తేదీన జిల్లా కేంద్రంలోని ఎస్ జేఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో దేవ సహాయం బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ అధ్యక్షతన శనివారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు తమ శాఖల సమగ్ర సమాచారంతో సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

30న కంటి వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్‌టౌన్, మే 22 : జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో ఈ నెల 30వ తేదీన కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ శివారెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. శిబిరంలో దృష్టి లోపం గల వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారిని మహబూబ్‌నగర్ రాంరెడ్డి కంటి దవాఖానకు పంపనున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ఒక రోజు ముందుగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకొని ఆధార్‌కార్డు లేదా రేషన్ కార్డు జిరాక్స్ కాపీ వెంట తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440454284 నెంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మోసాలను అరికట్టడం అందరి బాధ్యత

సదస్సులో మాట్లాడుతున్న బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరశర్మ

నాగర్‌కర్నూల్ టౌన్, మే 22 : ఆన్‌లైన్ మోసాలను అరికట్టడం అందరి బాధ్యత అని బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరశర్మ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కిసాన్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మతపెద్దలు, ఉపాధ్యాయులు, కమ్యూనిటీ లీడర్స్, చైల్డ్ లైన్, జిల్లా బాలల పరిరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మోసాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల, బాలికలు తెలియని వారితో సోషల్ మీడియాలో స్నేహం చేయొద్దన్నారు. బాల్య వివాహాలు నిర్మూలనకు బ్రాహ్మణులు ఖాజీలు కృషి చేయాలన్నారు. వివాహం జరిపించేటప్పుడు అమ్మాయి, అబ్బాయి వయస్సు ధ్రువ పత్రాలు చూడాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా ఖాజీల అధ్యక్షుడు అబ్దుల్లా, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ లక్ష్మణ్‌రావు, బ్రాహ్మణ సంఘం నాయకులు చంద్రశేఖర్‌శర్మ, రాజశేఖర్‌శర్మ, చైల్డ్ లైన్, డీసీపీయూ సభ్యులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరుడిని దర్శించుకున్న శ్రీశైల ఆలయ పూజరులు

పూజారులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

అచ్చంపేటరూరల్, మే 22: మండలంలోని ఉమామహేశ్వరాలయాన్ని బుధవారం శ్రీశైల ఆలయ పూజరులు దర్శించుకున్నట్లు ఆలయ చైర్మన్ కందురు సుధాకర్, ఈవో శ్రీనివాసరావు తెలిపారు. వారు అమ్మవారికి కుంకుమార్చన, పరమశివుడికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో గిరిప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు , ఆలయ అర్చకులు వీరయ్యశాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మాపూర్-డిండి బస్సును పునరుద్ధరించాలి

వంగూరు, మే 22 : వంగూరు మండలంలోని ఉమ్మాపూర్-డిండి బస్సును పునరుద్ధరించడంతోపాటు మండలానికి అదనపు బస్సులు నడిపించాలని కోరుతూ మండలంలోని తుమ్మలపల్లికి చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేశ్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్సులు రాక మండల ప్రజలు వాటిని ఉపయోగించుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. పాఠశాలలు త్వరలో ప్రారంభం కానున్న నేపద్యంలో బస్సులు నడిపించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు శ్రీనివాస్, అనిల్, ప్రసాద్, వెంకటేశ్, విష్ణు, శాయిబాబు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ పూజలు

ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

లింగాల, మే 22 : మండలంలోని ధారారం గ్రామంలోని రామాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం వార్షికోత్సవ పూజ లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో మాజీ సర్పంచ్ కవితా శ్రీనివాసులు, శ్రీశైలం, అశోక్‌రెడ్డి, డిప్యూటీ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ బాబు, శ్రీశైలంగౌడ్, మంగ్యానాయక్, నాగయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794